సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 4 । ఫిబ్రవరి । 2023



పారిజాతగిరిలో కల్యాణోత్సవం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు.



హుండీ ఆదాయం లెక్కింపు

ఆగిరిపల్లి: స్థానిక శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 2 నెలల కాలానికి రూ.1,57,955 ఆదాయం లభించింది.



శ్రీవారి సేవలో..

ద్వారకాతిరుమల: చినవెంకన్న ఆలయాన్ని డైరెక్టర్ ప్రొటోకాల్, డిప్యూటీ సెక్రటరీ జీఏడీ (ప్రొటోకాల్), ఏపీహెచ్‌డీసీ, సివిల్ ఏవియేషన్ ఎండీ ఎం.సుబ్రహ్మణ్యంరెడ్డి సందర్శించారు.

న్యూస్‌రీల్

పక్కాగా భూముల రీసర్వే



మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ మురళి

ఆకివీడు: డ్రోన్లు, రోవర్లతో పక్కాగా భూముల రీ సర్వే చేస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ జేవీ మురళి తెలిపారు. అయిభీమవరం గ్రామంలో రీ సర్వేలో భాగంగా గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సర్వే సిబ్బందికి సూచనలు ఇచ్చారు. రైతుల భూముల వివరాలు, సర్వే నంబర్లను సర్వే సిబ్బందికి తెలియజేయాలన్నారు. ఆకివీడు, కాళ్ల మండలాల్లో పూర్తిస్థాయిలో రీ సర్వే త్వరితగతిన నిర్వహించాలని ఆదేశించారు. ఇందుకోసం నరసాపురం డివిజన్ నుంచి 25 మంది సర్వేయర్లను, 25 మంది వీఆర్వోలను ఆకివీడు, కాళ్ల మండలాలకు తరలించి సర్వే చేయించాలని జిల్లా సర్వేయర్ జాషువాకు సూచించారు. సర్వేకు అవసరమైన డ్రోన్లను, రోవర్లను సిద్ధం చేసుకోవాలన్నారు. ఆకివీడు, కాళ్ల మండలాల్లో 30 వేల ఎకరాల చొప్పున సర్వే చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే ఆకివీడు మండలంలో మూడు గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తయిందన్నారు. ముందుగా ఆయన సిద్ధాపురం, కోళ్లపర్రు, చినకాపవరం, పెదకాపవరం గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించి, సచివాలయ వ్యవస్థ కీలకమని, సిబ్బంది సేవల ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. జేసీ వెంట ఆర్డీఓ దాసిరాజు, తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, ఏడీఏ కె.శ్రీనివాసరావు, ఎంపీడీఓ శ్రీకర్, ఏఓ ప్రియాంక ఉన్నారు.

షూటింగ్ సందడి



పట్టిసం రేవులో సినిమా షూటింగ్

పోలవరం రూరల్: గోదావరి తీరంలో షూటింగ్ సందడి కనిపించింది. పట్టిసం శివక్షేత్రం రేవులో నూతన నటీనటులతో కొత్త చిత్రం నిర్మాణం జరుగుతోంది. గోదావరి నదిలో వేట చేసేందుకు సంబంధించి మత్స్యకారుడి సన్నివేశాలను శుక్రవారం చిత్రీకరించారు. అలాగే పాటకు సంబంధించిన సన్నివేశాలను కూడా చిత్రీకరించారు.

బాల్య వివాహాలపై కఠిన చర్యలు

భీమవరం(ప్రకాశం చౌక్): బాల్య వివాహాలపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ప్రశాంతి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ అధికారులతో బాల్య వివాహాలపై శుక్రవారం ఆడిట్‌ను నిర్వహించారు. జిల్లాలో జరిగిన ఎనిమిది బాల్య వివాహాలపై ఆమె సమీక్షించారు. బాల్య వివాహాలు మీకు తెలియకుండానే జరుగుతున్నాయా అని గట్టిగా ప్రశ్నించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా బాల్య వివాహం చేస్తే పోక్సో కేసు నమోదు చేశామన్నారు. ఐసీడీఎస్ పీడీ బి.సుజాత రాణి, సీడీపీఓలు, సచివాలయం, అంగన్‌వాడీ సిబ్బంది, వీఆర్ఏలు పాల్గొన్నారు.

రూ.30 కోట్లతో గ్రంథాలయ బడ్జెట్



మాట్లాడుతున్న చైర్మన్ పద్మశ్రీ

ఏలూరు(ఆర్ఆర్‌పేట): జిల్లా గ్రంథాలయ సంస్థకు సంబంధించి 2023–24 సంవత్సరానికి రూ.30 కోట్ల అంచనాలతో బడ్జెట్‌ను చైర్మన్ చీర్ల పద్మశ్రీ ఆమోదించారు. శుక్రవారం స్థానిక కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు సభ్యులు తీర్మానం చేశారు. అలాగే గ్రంథాలయాలకు దాతలు బహూకరించిన వస్తువులు, పుస్తకాలను స్వీకరించి వారికి ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానించారు. గ్రంథాలయాల్లో ఉన్న చదవడానికి పనికిరాని పుస్తకాలను తొలగించడానికి పౌర గ్రంథాలయ శాఖ సంచాలకునికి సిఫార్సు చేస్తూ తీర్మానించారు. డీఈఓ ఎం.వెంకట అవధాని, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ తనిఖీలు

తాడేపల్లిగూడెం రూరల్: చినతాడేపల్లి గ్రామంలోని ఒక ప్రైవేట్ గోదాములో శుక్రవారం రాత్రి విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీ కరణంకుమార్ ఆధ్వర్యంలో డీఎస్పీ శింగులూరి వెంకటేశ్వర్లు, సీఐ యూజే విల్సన్‌లు సోదాలు జరిపారు. తనిఖీలు అర్ధరాత్రి వరకు కొనసాగుతున్నాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్, విజిలెన్స్ ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

దివ్యాంగులకు బంగారు భవిత

- ప్రత్యేకావసరాల పిల్లలకు బాసటగా కేంద్రాలు
- ఫిజియోథెరపీ పద్ధతులతో సత్ఫలితాలు
- ఆధునిక పరికరాలతో శారీరక, మానసిక మార్పులు
- ఉమ్మడి జిల్లాలో 49 భవిత కేంద్రాలు

భవిత కేంద్రాల వివరాలు

	ఏలూరు	'పశ్చిమ'
కేంద్రాలు	29	20
చిన్నారులు	484	280
ఐఈఆర్టీలు	38	27
ఫిజియోథెరపిస్టులు	9	7
ఆయాలు	20	20



కైకలూరు భవిత కేంద్రంలో ప్రత్యేకావసరాల చిన్నారులకు పాఠాలు బోధిస్తున్న ఐఈఆర్టీ

కైకలూరు: దివ్యాంగుల జీవితాల్లో భవిత కేంద్రాలు చిరుదివ్వెలు వెలిగిస్తున్నాయి. విధి వంచించిన విభిన్న ప్రతిభావంతుల్లో మార్పు తీసుకువస్తున్నాయి. కేంద్రాల్లోని ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్లు(ఐఈఆర్టీ) తల్లిదండ్రులకంటే మిన్నగా చిన్నారులకు సేవలు అందిస్తున్నారు. అడుగుతీసి అడుగువేయలేని స్థితిలో చేరిన దివ్యాంగులకు నడక నేర్పి విద్యాబుద్ధులు అందిస్తున్నారు. ప్రత్యేకావసరాల పిల్లల సంక్షేమానికి ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా ఆధునిక పరికరాలు అందిస్తోంది. దీంతో తమ బిడ్డల్లో వచ్చిన మార్పును చూసి తల్లిదండ్రుల కళ్లలో ఆనందం వెల్లివిరుస్తోంది.

744 మంది చిన్నారులు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 49 భవిత కేంద్రాల్లో 744 మంది దివ్యాంగులు సేవలు అందుకుంటున్నారు. 68 మంది ఐఈఆర్టీలు వీరి ఆలనాపాలనా చూస్తున్నారు. వీరితో పాటు మరో 40 మంది ఆయాలు విధులు నిర్వహిస్తున్నారు. బుద్ధిమాంద్యం, మాట్లాడటంలో లోపం, పాక్షిక, పూర్తి అంధత్వం, వినికిడి, అభ్యాసనా లోపాలు, స్థిరత్వం లేమితో బాధపడుతున్న పదహారేళ్లలోపు విద్యార్థులకు భవిత కేంద్రాలు విశేష సేవలు అందిస్తున్నాయి.

వైద్య నిర్ధారణ శిబిరాలు

ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికలకు ఉచిత ఉపకరణాల పంపిణీ కోసం వైద్య నిర్ధారణ శిబిరాలు ఉమ్మడి జిల్లాలో నిర్వహిస్తున్నారు. ఏలూరు జిల్లాలో జంగారెడ్డిగూడెం, కైకలూరులో పూర్తికాగా నూజివీడులో నిర్వహించాల్సి ఉంది. మొత్తం 240 మంది దివ్యాంగులను శిబిరాల ద్వారా గుర్తించారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరంలో జరగ్గా, 7న తణుకు, 10న పాలకొల్లులో ఉచిత శిబిరాలు నిర్వహించనున్నారు. శిబిరాల్లో గుర్తించిన దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని అలింకో కంపెనీ నుంచి హియిరింగ్ ఎయిడ్స్, కాలిపర్స్, వీల్ చైర్స్, రోలేటర్స్, హ్యాండ్ స్టిక్స్, సీపీ చైర్ వంటి పరికరాలను ఉచితంగా అందించనున్నారు.

సేవలకు వందనం

భవిత కేంద్రాల్లో ప్రత్యేకావసరాల గల చిన్నారులకు ఐఈఆర్టీలు, ఆయాలు ఎనలేని సేవలు అందిస్తున్నారు. ప్రతి వారం ఫిజియోథెరపీ చేయిస్తున్నారు. దృష్టిలోపం కలిగిన వారికి బ్రెయిలీ లిపిలో బోధిస్తున్నారు. చెవిటి, మూగ వంటి సమస్యలు ఉన్నవారికి స్పీచ్ థెరపీ అందిస్తున్నారు. నడక సరిగా రాని పిల్లల కోసం స్టెప్పర్, వాకింగ్‌బార్‌లు అందుబాటులో ఉన్నాయి. మనోవికాసం వృద్ధి చెందేలా గణిత భావనలు గుర్తుండేలా పూసల చట్రాలు, ఆట వస్తువులు ఉన్నాయి. బుద్ధిమాంద్యం కలిగిన వారికి ఎంఆర్ కిట్‌లు అందుబాటులో ఉన్నాయి.

స్పీచ్ థెరపీతో మాటలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న చిన్నారి పేరు హకీమా. పుట్టుకతో మూగ, వినికిడి లోపం. 12 ఏళ్ల హకీమా ఆరేళ్ల క్రితం కైకలూరు భవిత కేంద్రంలో చేరింది. స్పీచ్ థెరపీలో చిన్నారికి ఐఈఆర్టీ జి.వెంకటలక్ష్మి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. తల్లిదండ్రులు కూడా శ్రద్ధగా హకీమాను రోజూ కేంద్రానికి తీసుకొస్తున్నారు. దీంతో బాలిక అక్షరాలను అర్థం చేసుకుంటోంది. ప్రస్తుతం ఉర్దూ పాఠశాలలో చదువుకుంటోంది.

త్వరలో శస్త్రచికిత్సలు



ప్రభుత్వం ప్రత్యేకావసరాల చిన్నారుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. సహాయకులకు అలవెన్సులు, రవాణా ఖర్చులు అందిస్తున్నాం. బుద్ధిమాంద్యం కలిగిన వారికి ఉచితంగా ఇచ్చే సీపీ చైర్ విలువ రూ.35 వేలు ఉంటుంది. నాడు–నేడు పథకంలో ప్రభుత్వం భవిత కేంద్రాలను తీర్చిదిద్దుతోంది. గ్రహణంమొర్రి, గ్రహణశూల, కండరాలలోపంతో బాధపడే వారికి త్వరలో శస్త్ర చికిత్సలు అందుబాటులోకి రానున్నాయి.

– బి.భాస్కరరాజు,
ఐఈఆర్టీ జిల్లా కో–ఆర్డినేటర్, ఏలూరు

విదేశీ విద్యకు తోడ్పాటు

కలెక్టర్ ప్రశాంతి



జగనన్న విదేశీ విద్యా దీవెన చెక్కును అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం: విదేశాల్లో విద్యనభ్యసించడానికి రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా తోడ్పాటు అందిస్తోందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు నమూనా చెక్కును ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా నుంచి ఈ ఏడాది 8 మందిని ఎంపిక చేసి తొలి విడతగా రూ.52,36,600 ఆర్థిక సాయాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేద విద్యార్థులు ప్రపంచంలోనే పేర్గాంచిన వర్సిటీల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. జిల్లాలో ముగ్గురు ఎస్సీ విద్యార్థులకు సుమారు రూ.9 లక్షలు, ఇద్దరు బీసీ విద్యార్థులకు రూ.2.50 లక్షలు, ఈబీసీ, కాపు విద్యార్థులు ఇద్దరికి రూ.13.25 లక్షలు మైనార్టీ విద్యార్థికి రూ.27.61 లక్షలను అందించామన్నారు. ముందుగా సీఎం జగన్ ప్రారంభించిన విదేశీ విద్యాదీవెన కార్యక్రమాన్ని వర్చ్యువల్‌గా తిలకించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జీవీఆర్‌కేఎస్ఎస్ గణపతి రావు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, జిల్లా ఎస్టీ సంక్షేమ అధికారి డి.పుష్పరాణి పాల్గొన్నారు.

విశ్వనాథ్‌కు 'పశ్చిమ'తో అనుబంధం



భీమవరంలో విశ్వనాథ్‌ను సత్కరిస్తున్న దృశ్యం (ఫైల్)



సోమేశ్వరస్వామి సన్నిధిలో.. (ఫైల్)

పాలకొల్లు అర్బన్/సాక్షి, భీమవరం: కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు జిల్లాతో ప్రత్యేక అనుబంధం ఉంది. 1989లో పాలకొల్లులో లలిత కళాంజలి నాటక అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిల భారత స్థాయి నాటక పోటీల బహుమతి ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయన్ను పట్టణ పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. సినీ నిర్మాత ఎస్.గోపాల్ రెడ్డి, దర్శకుడు కోడి రామకృష్ణ తదితరుల చేతుల మీదుగా ఘన సత్కారం అందుకున్నారు. 2003లో మరోమారు ఆయన జూనియర్ ఎన్టీఆర్ నటించిన అల్లరి రాముడు సినిమా షూటింగ్ నిమిత్తం పాలకొల్లు వచ్చారు. పాలకొల్లు, చించినాడ, యలమంచిలి, పెనుగొండ ప్రాంతాల్లో చిత్రీకరణలో ఆయన పాల్గొన్నారు. ఐదు రోజులకు పైగా ఇక్కడే బస చేశారు. విశ్వనాథ్ మృతికి పాలకొల్లు కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు మానాపురం సత్యనారాయణ, అధ్యక్షుడు కేవీ కృష్ణవర్మ, మేడికొండ శ్రీనివాసచౌదరి, విన్నకోట వెంకటేశ్వరరావు, నటీనట సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు కత్తుల రామమోహన్, తాళాబత్తుల వెంకటేశ్వరావు, నీలంశెట్టి సత్యప్రసాద్, గుడాల హరిబాబు, కొంతేరు యూత్‌క్లబ్ అధ్యక్షుడు అంబటి మురళీకృష్ణ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

భీమవరంలో.. 2011లో భీమవరంలో శ్రీచైతన్య భారతీ సంగీత, నృత్య నాటకపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి నాటిక పోటీలకు విశ్వనాథ్ హాజరయ్యారు. రెండు రోజులపాటు భీమవరంలో బస చేశారు. స్థానికంగా ఏర్పాటుచేసిన విశ్వనాథ్‌తో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని సినీ అభిమానుల ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. నాటకపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్ ఆధ్వర్యంలో సత్కారం అందుకున్నారు. అదే వేదికపై నటుడు సాయికుమార్ దంపతులను విశ్వనాథ్ చేతులమీదుగా సత్కరించారు.

చినవెంకన్న సేవకుడే..

ద్వారకాతిరుమల: దర్శకుడు కె.విశ్వనాథ్ చినవెంకన్న సేవకుడు. ఆయన ద్వారకాతిరుమల క్షేత్రాన్ని సందర్శించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులు, ఆలయ సిబ్బంది విశ్వనాథ్ క్షేత్రానికి వచ్చిన నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

గృహసారథులు.. సంక్షేమ వారధులు

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: గృహసారథులు, వలంటీర్లు ప్రజల సంక్షేమానికి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి వారధులని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు తమవంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామన్నారు. ఈ మేరకు సైనికుల్లా పనిచేయాలని కోరారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని, ఎన్నికల మేనిఫెస్టోను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నామన్నారు. విధి నిర్వహణలో ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. మండలంలోని గ్రామాల్లో ప్రజలకు కోట్లాది రూపాయలు వెచ్చించి మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటా గడపగడపకూ కార్యక్రమాన్ని ఆదరిస్తున్నారన్నారు. దేశానికే ఆదర్శంగా సీఎం జగన్ పాలన ఉందన్నారు. వలంటీర్ల సేవలను ప్రతి ఒక్కరూ కొనియాడుతున్నారన్నారు. అర్హులకు స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికీ ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందన్నారు. గతంలో జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ నాయకులు ప్రజలను దోచుకున్న తీరును ఎండగట్టేలా గృహసారథులు, వలంటీర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సీఎం జగన్ దూరదృష్టిని అంచనా వేయలేక చంద్రబాబు, పవన్ కల్యాణ్ దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. యువగళం కార్యక్రమంలో లోకేష్ మాట్లాడుతున్న తెలుగు ప్రజలకు అర్థం కావడం లేదన్నారు.

చిత్తశుద్ధితో ముందుకు సాగాలి

తాడేపల్లిగూడెం నియోజకవర్గ పరిశీలకులు మంచెం మైబాబు మాట్లాడుతూ నిబద్ధతతో విధులు నిర్వహించే వలంటీర్లు, గృహసారథుల వివరాలు సీఎం జగన్ వద్ద ఉన్నాయన్నారు. అర్హులకు సంక్షేమం అందించేలా వలంటీర్లు చిత్తశుద్ధితో ముందుకు సాగాలన్నారు. జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, వెలిశెట్టి నరేంద్రకుమార్, ముప్పిడి సంపత్‌కుమార్, కొట్టు విశాల్, చిట్టూరి నాగేంద్ర, తమ్మిశెట్టి చుక్కయ్య తదితరులు, 36 గ్రామాల వలంటీర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

త్వరితగతిన దర్యాప్తు

ఏలూరు టౌన్: మహిళలపై నేరాలకు పాల్పడిన నిందితులకు కఠినంగా శిక్షలు పడేలా పటిష్ట దర్యాప్తు చేయాలనీ, బాధితులకు న్యాయం జరిగేలా పోలీస్ సిబ్బంది కేసుల పరిష్కారానికి తమవంతు కృషి చేయాలని ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ అన్నారు. ఏలూరులోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం నుంచి మహిళలు, యువతులు, బాలికలపై నేరాల్లో కేసుల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు పోలీస్ సబ్‌డివిజన్లలోని సీఐలు, ఎస్సైలకు సూచనలిచ్చారు. ఆయా కేసుల్లో దర్యాప్తులను త్వరితగతిన పూర్తిచేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన కేసుల దర్యాప్తు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కేసుల్లో దర్యాప్తు పూర్తిచేసి కోర్టుల్లో చార్జిషీట్ దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు.

సృజనహితం.. ఆలోచనాత్మకం

ఆకట్టుకున్న జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్



భీమవరంలో జరిగిన జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో విజేతలతో నిర్వాహకులు

సాక్షి, భీమవరం: పట్టణంలోని ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రెండు రోజులపాటు నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 96 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఆయా పాఠశాలలకు చెందిన గైడ్ టీచర్ సహకారంతో విద్యార్థుల వినూత్న ఆలోచనలతో ప్రజలకు ఉపయోగపడేలా రూపొందించిన ప్రాజెక్టులు భళా అనిపించాయి. తోటి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచాయి.

ఐదు విభాగాల్లో ఎంపిక

ఐదు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలకు ప్రాజెక్టులను ఎంపిక చేశామని, వీరు రాష్ట్రస్థాయి ప్రదర్శనలో పాల్గొంటారని శుక్రవారం డీఈఓ ఆర్.వెంకటరమణ తెలిపారు. విజేతలకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందజేశారు. జిల్లా సైన్స్ అధికారి వీఎంజే శ్యామ్‌ప్రసాద్, ఉప విద్యాశాఖాధికారి బి.శ్రీరామ్, సర్వశిక్ష ఏపీసీ శ్యామ్‌సుందర్ డీఐ బి వినాయకుడు, మండల విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

- **ఎకో ఫ్రెండ్లీ విభాగంలో..** ఆర్.మధుమతి (మట్లపాలెం హైస్కూల్), ఎ.అమరేశ్వరనాయుడు (పెనుమదం హైస్కూల్)
- **హెల్త్ అండ్ క్లీన్‌నెస్ విభాగంలో..** సీహెచ్ ఆషా (నాగేంద్రపురం హైస్కూల్), పి.చాందిని అలేఖ్య (యలమంచిలి హైస్కూల్)
- **సాఫ్ట్‌వేర్ అండ్ యాప్స్ విభాగంలో..** జి.ఉదయ్ (చెరుకువాడ హైస్కూల్), ఎం.జస్వంత్ (శృంగవృక్షం హైస్కూల్)
- **ఎన్విరాన్‌మెంటల్ క్లయిమేట్ చేంజస్ విభాగంలో..** సీహెచ్ లీలా సత్య శ్రీనాథ్ (మట్లపాలెం హైస్కూల్), ఎస్.లీలా లోకేష్ తాడేరు (హైస్కూల్)
- **మ్యాథమెటికల్ మోడలింగ్ విభాగంలో..** కె.సుబ్బలక్ష్మి (దర్శిపర్రు హైస్కూల్), బి.గౌతమ్‌నాగ (ఇరగవరం హైస్కూల్) మొదటి రెండు స్థానాల్లో నిలిచారు.

భూగర్భ జలాలు పెంచేలా..



పెంటపాడు మండలం అలంపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి పీకే సాయిఈశ్వర్ భూగర్భ జలాలను పెంచేలా ప్రాజెక్టు రూపొందించాడు. దీని ద్వారా గృహాల్లో వాడకం నీటిని 60 శాతం భూమిలోనికి ఇంకిపోయేలా చేసుకోవచ్చు. భూగర్భ జలాలు పెరగడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థ కూడా పెద్దగా అవసరముండదని వివరించాడు. ప్రాజెక్టు తయారీకి ఉపాధ్యాయుడు, గైడ్ టీచర్ ఈఆర్ఏ గణేష్ రావు సహకరించారు.

చిట్టి.. చిట్టి.. రోబో



కాళ్ల మండలం కోపల్లె జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని లత వృద్ధులు, దివ్యాంగులకు సాయపడేలా రోబో ప్రాజెక్టును రూపొందించింది. తక్కువ ఖర్చుతో తయారుచేసిన రోబోకు టైమింగ్ ప్రకారం ప్రోగ్రామ్ చేయడం ద్వారా మందులు అందించడం, తాగునీరు సరఫరా చేయడం వంటి పనులు చేయించుకోవచ్చని వివరించింది. పరిశ్రమల్లో కూడా దీనిని ఉపయోగించవచ్చని తెలిపింది. ప్రాజెక్టుకు ఉపాధ్యాయురాలు సుభాషిణి సహకారం అందించారు.

సులభంగా పరిష్కారం

పెంటపాడు మండలం దర్శిపర్రు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని డి.సుబ్బలక్ష్మి లెక్కల్లో డిసైడింగ్ ప్రాబ్లమ్స్, డిఫైరింగ్ వేరిబుల్స్ వంటి నాలుగు విధానాలను అనుసరిస్తే ఎటువంటి సమస్యకైనా పరిష్కారం చూపవచ్చని తన ప్రాజెక్టు ద్వారా వివరించింది. ఈ ప్రాజెక్టు ద్వారా సులభంగా లాభం పొందవచ్చని తెలిపింది. ప్రాజెక్టుకు గైడ్ టీచర్‌గా టి.మహితనళిని వ్యవహరించారు. ఈ ప్రాజెక్టు విశేషంగా ఆకట్టుకుంది.



క్లుప్తంగా

హ్యాండ్‌బాల్‌లో ప్రథమ స్థానం



విజేతగా నిలిచిన హేలాపురి ఇంజనీరింగ్ కళాశాల జట్టు

దెందులూరు: యూనివర్సిటీ స్థాయిలో జరిగిన హ్యాండ్‌బాల్ పోటీల్లో దెందులూరు మండలంలోని హేలాపురి ఇంజనీరింగ్ కళాశాల జట్టు కేఎల్ యూనివర్సిటీ జట్టుపై విజయం సాధించింది. గుంటూరు జిల్లా వడ్లమూడిలో ఈనెల 1న జరిగిన పోటీల్లో హేలాపురి విద్యార్థులు నన్నయ విశ్వవిద్యాలయం తరఫున పోటీల్లో పాల్గొన్నారు. ప్రథమ స్థానం సాధించిన జట్టుకు శుక్రవారం వేగవరంలోని కళాశాలలో ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, ఏఈవో టీఎస్ కరుణానిధి షీల్డ్, ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు.

పాలకోడేరులో చోరీ

పాలకోడేరు: ఇంటి తలుపులు బద్దలు గొట్టి బంగారం, నగదు అపహరించిన సంఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం పాలకోడేరులో పీఎంపీ వైద్యుడు మామిడిశెట్టి మూర్తి నందన శుక్రవారం ఉదయం తాళం వేసి బయటకు వెళ్లి సాయంత్రం 3 గంటలకు వచ్చారు. లోపలకు వెళ్ళేసరికి వెనుక వైపు తలుపులు తీసి బీరువా పగుల గొట్టి ఉండటం కనిపించింది. బీరువాలోని లక్షా యాభై వేల విలువైన బంగారం,నగదు అపహరించినట్లు గుర్తించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్‌ఎస్ రామచంద్రరావు తెలిపారు.

హోరాహోరీగా ఎస్‌పీఎల్ మ్యాచ్‌లు

Regional Sponsor APMDC APMDC FOUNDATION

సాక్షి, భీమవరం: సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలు రెండో రోజు శుక్రవారం హోరాహోరీగా సాగాయి. ఫైనల్స్‌లో నిలిచేందుకు ఆటగాళ్లు సత్తా చాటుతున్నారు. ప్రేక్షకులు హర్షధ్వానాలతో సందడి చేస్తూ ఆటను ఆస్వాదిస్తూ క్రీడాకారులను ఉత్సాహపరుస్తున్నారు. మొదటి మ్యాచ్‌లో డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు, తణుకు ఎస్‌సీఐఎం డిగ్రీ కళాశాల జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన డీఎన్నార్ జట్టు 9.5 ఓవర్లలో 54 పరుగులు చేసి ఆలౌటయ్యింది. అనంతరం 8 వికెట్ల నష్టానికి లక్ష్యాన్ని ఛేదించి తణుకు ఎస్‌సీఐఎం డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. చివరి బంతి వరకూ ఉత్కంఠను రేకెత్తిస్తూ ఈ మ్యాచ్ సాగింది. 4 వికెట్లు తీసి మనోజ్ కుమార్ తణుకు ఎస్‌సీఐఎం డిగ్రీ కళాశాల జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. రెండో మ్యాచ్ ఏలూరు సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, భీమవరం విష్ణు ఫార్మసీ కళాశాల జట్ల మధ్య జరిగింది. సీఆర్ రెడ్డి కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 101 భారీ స్కోరు చేసింది. అనంతరం కట్టుదిట్టమైన బౌలింగ్‌తో విష్ణు కళాశాల జట్టును 54 పరుగులకే పరిమితం చేసింది. మూడో మ్యాచ్‌లో భీమవరం బీవీ రాజు డిగ్రీ కళాశాల జట్టు, ఏలూరు ఇంజినీరింగ్ కళాశాల జట్టు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్‌కు వచ్చిన బీవీరాజు కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 63 పరుగులు సాధించింది. ఛేదనలో ఏలూరు ఇంజినీరింగ్ కళాశాల జట్టు 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. మరోసారి ఉత్కంఠ భరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో ఒక బంతి మిగిలి ఉండగా ఫలితం తేలింది. ఇరు జట్లు విజయం కోసం సర్వశక్తులూ ఒడ్డి పోరాడాయి. అంతిమంగా విజయం ఏలూరు ఇంజినీరింగ్ కళాశాల జట్టును వరించింది.

SPL SAKSHI PREMIER LEAGUE




మొదటి మ్యాచ్‌లో విజేతగా నిలిచిన తణుకు ఎస్‌సీఐఎం డిగ్రీ కళాశాల జట్టు



రెండో మ్యాచ్‌లో విజేతగా నిలిచిన ఏలూరు సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల జట్టు



మూడో మ్యాచ్‌లో విజేతగా నిలిచిన ఏలూరు ఇంజినీరింగ్ కళాశాల జట్టు



4 వికెట్లు తీసిన ఎస్‌సీఐఎం డిగ్రీ కళాశాల బౌలర్ మనోజ్ కుమార్

నేటి మ్యాచ్‌ల వివరాలు

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

మొదటి మ్యాచ్‌లో ఎస్‌బీటీ ఏవీ అండ్ ఎస్ఎన్ డిగ్రీ కళాశాల (వీరవాసరం) ఎస్‌సీఐఎం డిగ్రీ అండ్ పీజీ కళాశాల (తణుకు) జట్లు తలపడతాయి. రెండో మ్యాచ్‌లో సెయింట్ విన్సెంట్ డిపాల్ డిగ్రీ కళాశాల (ఏలూరు) రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల (ఏలూరు) జట్లు, మూడో మ్యాచ్‌లో శ్రీఆదిత్య డిగ్రీ కళాశాల (భీమవరం) సర్ సీఆర్‌రెడ్డి డిగ్రీ కళాశాల (ఏలూరు) జట్లు, నాలుగో మ్యాచ్‌లో విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (భీమవరం) ఎస్‌వీఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల (నిడదవోలు) జట్లు తలపడతాయి.

క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యత

నూజివీడు: రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అన్నారు. పట్టణంలోని విక్టోరియా పుర మందిరంలో 66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి అండర్-14 బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీలను శుక్రవారం చైర్‌పర్సన్ త్రివేణీ దుర్గ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించడం ద్వారా ఖ్యాతి గడించడమే కాకుండా జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని త్రివేణీదుర్గ అన్నారు. ఎస్‌జీఎఫ్ ఏలూరు జిల్లా సెక్రటరీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులతో జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీలకు రాష్ట్ర జట్టును సైతం ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 13 బాలబాలికల జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఈ పోటీలను లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్నారు.



బాస్కెట్‌బాల్ పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ

కార్యక్రమంలో కౌన్సిలర్ దాసరి మారు అప్పాజీ, వ్యాయామోపాధ్యాయ సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షులు సాయి శ్రీనివాస్, టోర్నమెంట్ అబ్జర్వర్ కే కృష్ణారెడ్డి, స్థానిక పారిశ్రామికవేత్త మూల్పూరి లక్ష్మణస్వామి, టోర్నమెంట్ నిర్వాహకులు వాకా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో నాలుగిళ్లు దగ్ధం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక మావుళ్లమ్మపేట, రిజిస్ట్రార్ కార్యాలయం వెనుక ఉన్న ప్రాంతంలో నాలుగిళ్లు అగ్నిప్రమాదానికి గురైన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం తాటాకిళ్ల పక్కన వెల్డింగ్ షాపు ఉండడంతో రాత్రి 8.30 గంటల సమయంలో నిప్పులు ఎగిరి ఇంటిపై పడడంతో క్షణంలో ఇళ్లు దగ్ధమయ్యాయని తెలిపారు. బొడ్డు లక్ష్మి, పోతురాజు లక్ష్మి, మంటల రాములమ్మ, మంటల చంటమ్ములు వీటిలో నివాసం ఉంటున్నారు. వీరిలో బొడ్డు లక్ష్మి, పోతురాజు లక్ష్మి, మంటల చంటమ్ముకు ఇటీవల టిడ్కో గృహాల్లో ఇళ్లు రావడంతో అక్కడే ఉంటున్నారు. లక్ష్మి అత్త బొడ్డు అనసూయ, మంటల రాములమ్మలు తాటాకిళ్లలో ఉంటున్నారని స్థానికులు తెలిపారు. ఆస్తి నష్టం వివరాలు తెలియ రాలేదని ఫైర్ అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న ఫైర్ ఆఫీసర్ జానకిరామయ్య తన సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. పట్టణ ఎస్సైలు ఎస్ ముత్యాలరావు, బి.శ్రీనివాసు, సచివాలయ సెక్రటరీ సతీష్, వీఆర్‌వో ఆర్.నాగరాజులు ప్రమాద వివరాలు తెలుసుకున్నారు.



మంటల్లో దగ్ధమవుతున్న తాటాకిళ్లు

బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్‌గా సూర్యనారాయణ



బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్‌గా నియామక పత్రం అందుకుంటున్న సూర్యనారాయణ

ఏలూరు (టూటౌన్): జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉభయ గోదావరి జిల్లాల కన్వీనర్‌గా ఎం.సూర్యనారాయణను నియమిస్తూ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ల కోసం పోరాడాల్సిన సమయం వచ్చిందన్నారు. తనకు హస్తకళల డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించిన ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

భీమడోలు: ఓ వివాహితను అసభ్య పదజాలంతో వేధిస్తున్న ఓ వ్యక్తిపై భీమడోలు పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. గుండుగొలనుకు చెందిన ఓ వివాహితకు చిత్తూరు జిల్లా తిరుపతికి చెందిన పి.గోపికృష్ణకు సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో గతంలో రెండు నెలల పాటు అతనితో వివాహిత కలిసి ఉంది. ఆ తర్వాత ఆమె అతన్ని వదిలేసి స్వగ్రామమైన గుండుగొలను వచ్చేసింది. ఇటీవల పి.గోపికృష్ణ వివాహిత ఫొటోలు సోషల్ మీడియాలో ఉంచి అసభ్య పదజాలంతో వేధిస్తున్నాడు. దీంతో బాధిత మహిళ దిశా హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేసింది. పి.గోపీకృష్ణపై భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా విక్రయదారులపై దాడులు



కాపుసారాను కలిగి ఉన్న నిందితులను అరెస్టు చేసిన సెబ్ అధికారులు

నూజివీడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)స్టేషన్ పరిధిలో శుక్రవారం దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ టీ.గోపాలకృష్ణ తెలిపారు. చాట్రాయి మండలం పోతనపల్లి చిన్నతండాకు చెందిన ఇస్లావతు ప్రతాప్ వద్ద 10 లీటర్ల కాపుసారా, స్కూటీని స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేశామన్నారు. ఆగిరిపల్లి మండలం సగ్గూరుకు చెందిన చెంగల సింగారయ్య వద్ద రెండు లీటర్ల కాపుసారా స్వాధీనం చేసుకోని అతనిని అరెస్టు చేశారు . చాట్రాయి మండలం చిన్నంపేటకు చెందిన కొమ్ము శివశంకర వరప్రసాద్ వద్ద రెండు లీటర్ల సారా ఉండటంతో అతనిపై కేసు నమోదు చేశామన్నారు. ముగ్గురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

అంగరంగ వైభవం.. నారసింహుని కల్యాణం



కల్యాణ తంతును నిర్వహిస్తున్న పండితులు

ద్వారకాతిరుమల: వేద పండితుల మంత్ర పఠనాలు.. శోభాయమానంగా తీర్చిదిద్దిన కల్యాణ వేదిక.. వరుడిగా మెరిసిపోతున్న స్వామివారు.. ఆ పక్కనే వధువులుగా కొలువుదీరిన అమ్మవార్లు.. ఒక్క మాటలో చెప్పాలంటే శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో.. జగదానంద కారకుడైన నారసింహ స్వామివారి వార్షిక దివ్య తిరుకల్యాణోత్సవం ఐఎస్ జగన్నాథపురం క్షేత్రంలో వైభవంగా జరిగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు.. నయనానందకరంగా సాగిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించి, పులకించిపోయారు.

అంగరంగ వైభవంగా..

ముందుగా శ్రీదేవి, భూదేవి సమేత నారసింహుని ఉత్సవ మూర్తులను సుందరగిరిపై నుంచి శుక్రవారం ఉదయం కొండ కింద కల్యాణ మండపం వద్దకు పల్లకి వాహనంలో తీసుకొచ్చారు. అక్కడ ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వేంచేపు చేసి, అలంకరించారు. అనంతరం పరిణయ వేడుకల్లో ఒక్కో ఘటాన్ని పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, కన్యాదానం జరిపి, సరిగ్గా 11.10 గంటల సుముహూర్త సమయంలో స్వామి, అమ్మవార్ల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేశారు. ఆ తరువాత వేద మంత్రోచ్ఛరణలతో మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకను పండితులు అట్టహాసంగా జరిపారు. ప్రభుత్వం తరపున గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, దేవస్థానం తరపున ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. వేడుక అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు, స్వామివారి అన్నప్రసాదాన్ని అందించారు. ఎమ్మెల్యే వెంట ఐఎస్ జగన్నాథపురం, ఐఎస్ రాఘవాపురం సర్పంచ్‌లు పసుపులేటి ఏసుబాబు, దాకారపు బంగారమ్మ, పసుపులేటి సాయిబాబు, దాకారపు అగ్గియ్య తదితరులున్నారు.



కల్యాణ వేడుకను తిలకిస్తున్న భక్తులు



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే తలారి, ఈవో

కిడ్నాపర్‌కు ఏడేళ్ల జైలుశిక్ష

తణుకు: బాలికను కిడ్నాప్ చేసి ఆమెను గాయపర్చిన కేసులో నిందితుడికి ఏడున్నరేళ్ల పాటు జైలు శిక్ష విధిస్తూ తణుకు కోర్టు న్యాయమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. పట్టణ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు మధురై జిల్లా వండియార్ గ్రామానికి చెందిన మైఖేల్ సెల్వం రెండేళ్ల క్రితం అదే రాష్ట్రానికి చెందిన తొమ్మిదేళ్ల మేరీదాస్‌ను కిడ్నాప్ చేసి తణుకు తీసుకొచ్చాడు. స్థానిక గణేష్ చౌక్ వద్ద ఉంటూ బాలికతో భిక్షాటన చేయిస్తూ వచ్చిన డబ్బులతో మైఖేల్ వ్యసనాలకు ఖర్చుపెట్టేవాడు. ఈ క్రమంలో 2021 మార్చి 21న భిక్షాటన సరిగా చేయడం లేదని కోపంతో బాలిక కుడిచేతిపై బలంగా కొట్టడంతో ఆమె చెయ్యి విరిగిపోయింది. దీంతో అప్పటి ఎస్సై డి.రవికుమార్ నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం శుక్రవారం తణుకు కోర్టులో హాజరుపరచగా నాలుగో అదనపు జ్యూడిషియల్ ఇన్‌చార్జ్ మెజిస్ట్రేట్ పి.అన్నపూర్ణ మైఖేల్ సెల్వంకు జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

నటుడు ముంగర కృష్ణ మృతి



నటుడు కృష్ణ

కైకలూరు: సినీ నటుడు, దర్శకుడు ముంగర కృష్ణ(61) అనారోగ్యంతో హైదరాబాదులో శుక్రవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కైకలూరుకు చెందిన ఆయన 1987లో పెళ్లికాని ఇల్లాలు అనే సినిమాలో హీరోగా చేశారు. చెన్నైలో కొంతకాలం ఉన్న తర్వాత హైదరాబాదులో స్థిరపడ్డారు. మొదట దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన పోలీసు వెంకటస్వామి సినిమాలో చిన్న వేషం వేశారు. నాగకన్య సినిమాలో నటించారు. తర్వాత హీరో బాలాదిత్యతో పిల్ల దొరికితే పెళ్ళి సినిమాకు దర్శకత్వం వహించారు. ఆయన విద్యాభ్యాసం కైకలూరులో సాగింది.

పట్టిసంలో ఏర్పాట్లపై సమీక్ష



పట్టిసంలో మహాశివరాత్రి ఉత్సవ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జేసీ పి.అరుణ్‌బాబు

పోలవరం రూరల్: పట్టిసం మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా దైవదర్శనం చేసుకుని వెళ్లేలా పటిష్ట ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. ఈ నెల 18 నుంచి జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పట్టిసం వద్ద ఏర్పాట్లపై రెండో దఫా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. శివక్షేత్రం వద్ద విద్యుత్ అలంకరణ, పారిశుధ్య పనులు, క్యూలైన్‌లు తదితర పనులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కంపార్ట్‌మెంట్‌లు ఏర్పాటు చేయాలని, ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి రద్దీ పరిస్థితి తెలుసుకోవాలన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరాతో పాటు జనరేటర్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. పారిశుధ్య పనులపై పంచాయతీ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు కూడా ఏర్పాటు చేయాలని తెలిపారు. దేవదాయశాఖ డిప్యూటీ కమీషనర్ ఆర్.విజయరాజు మాట్లాడుతూ భక్తుల దైవదర్శనానికి అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు ఉచిత ప్రసాదాలు, పాలు, మజ్జిగ సరఫరా వంటి కార్యక్రమాలను కూడా చేపడుతున్నట్లు తెలిపారు. 470 మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు నిఘా కూడా పెడతామన్నారు. ఆర్టీసీ జిల్లా అధికారి వర ప్రసాదరావు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం, నిడదవోలు, కొవ్వూరు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. డీఎంఅండ్‌హెచ్‌వో ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ 6 ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు మందులు, అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచుతామన్నారు. ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌లను జాయింట్‌కలెక్టర్ అరుణ్‌బాబు ఆవిష్కరించారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో, ఉత్సవ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎం.ఝాన్సీ రాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.శ్రీరామమూర్తి, జిల్లా అధికారులు ఆర్‌వీఎస్ ప్రసాద్, టి.వేణుగోపాల్, విజయరాజు, రామకృష్ణ, కె.రాంబాబు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కె.వీరభద్రరావు, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, హుకుంపేట జమీందార్ హోతా సీతారామశాస్త్రి, తహసీల్దార్ బి.సుమతి, ఎస్సై పవన్‌కుమార్, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస బాబు, ఆలయ ఈవో ఎంఎస్ఎస్ సంగమేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్న పాలనలో అన్ని వర్గాలకు మేలు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: సుపరిపాలన అందిస్తూ అన్ని వర్గాలకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌ మోహన్‌రెడ్డి ఆశీర్వదించాలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం సాయంత్రం తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ కుల, మత, రాజకీయ పార్టీలకతీతంగా అందరికీ సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని తెలిపారు. గత మూడున్నరేళ్ళ కాలంలో రాష్ట్ర ప్రజలు స్వర్ణయుగాన్ని చవి చూస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో 1.60 కోట్ల కుటుంబాలకు డీబీటీ విధానంలో ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా జగన్‌ పథకాలను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే సంక్షేమ పథకాలు అందేవన్నారు. జగన్‌ ప్రభుత్వంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తున్నారన్నారు. చంద్రబాబు, పవన్‌ కళ్యాణ్‌లకు ప్రజలు బాగుంటే నచ్చడం లేదన్నారు. జగన్‌ ప్రభుత్వాన్ని కూలగొట్టాలని ప్రయత్నిస్తున్నారన్నారు. సంక్షేమ పాలనను నిలబెట్టుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పాదయాత్రలు చేస్తే ఎవరూ ముఖ్యమంత్రులు కాలేరనే విషయాన్ని లోకేష్‌నాయుడు గుర్తించాలన్నారు. మరో పక్క చంద్రబాబు దత్తపుత్రుడు వైఎస్సార్‌సీపీ కాపు ప్రజాప్రతినిధులను నోటికొచ్చినట్లు తిడుతున్నారన్నారు. సంస్కృతి, సంస్కారం లేకుండా తిడితే ఎవరూ ఊరుకోరన్నారు. గౌరవం ఇచ్చి పుచ్చుకోవాలని హితవు పలికారు. ఎంతో దుర్మార్గపు ఆలోచన, కుట్రతో అధికారంలోకి రావాలని చంద్రబాబు, పవన్‌లు చూస్తున్నారన్నారు. ప్రజలు అంత అమాయకులు కారనే విషయాన్ని వారు తెలుసుకోవాలన్నారు. రాబోయే ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే పోరాటమన్నారు. ఈ ఎన్నికల్లో సంచలన తీర్పు ప్రజలు ఇవ్వబోతున్నారని, ప్రతిపక్షాలకు నాడు చెల్లు చీటి పడక తప్పదని జోస్యం చెప్పారు. తొలుత సచివాలయ ప్రాంగణంలో నిర్మించిన పలువురు జాతీయ, రాష్ట్ర నాయకుల విగ్రహాలతో పాటు రూ.1.55కోట్ల విలువైన ప్రభుత్వ భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, సర్పంచ్‌ రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, ఎమ్పీటీసీలు మట్ట సత్యనారాయణ, మార్లపూడి సుబ్బారావు, రెడ్డి సూరిబాబు, సర్పంచ్‌ ఎలిపే గాంధీ, ఉప సర్పంచ్‌ మేణ్ణి రామారావు, వైస్‌ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, మండల సచివాలయాల కన్వీనర్‌ ముప్పిడి సంపత్‌కుమార్‌, మండల సేవాదళ్‌ చైర్మన్‌ కొండుబోయిన కృపావరం, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్‌, జడ్డు హరిబాబు, తహసీల్దార్‌ వైకేవీ.అప్పారావు, ఎంపీడీవో ఎం.వెంకటేష్‌, పీఆర్‌ డీఈ వీఎస్‌.వేణుగోపాల్‌, ఏడీఏ పి.మురళీకృష్ణ, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, ఏపీవో ఏవీవీఎస్‌వీ.ప్రసాద్‌, పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్‌, నాయకులు బొద్దాని శ్రీనివాస్‌, పార్టీ కార్యకర్తలు, హెల్త్‌, ఆర్‌డబ్ల్యుఎస్‌, పీఆర్‌, ఎలక్ట్రికల్‌, హౌసింగ్‌ సిబ్బంది పాల్గొన్నారు.



గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రజలతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

క్లుప్తంగా

ఆస్పత్రికి వెళ్లి పింఛన్‌ అందజేత



రాజమండ్రి వెళ్లి పింఛన్‌ అందజేస్తున్న వలంటీర్‌

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో 13వ వార్డుకు చెందిన ఎస్‌.నాగరాజుకు ఇటీవల గుండెపోటు రావడంతో రాజమండ్రిలో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం వలంటీర్‌ పాలేపు ధనకుమారి, తన సహచర వలంటీర్లు లక్ష్మీకుమారి, అనూషలతో కలిసి రాజమండ్రి వెళ్లి నాగరాజుకు పింఛన్‌ సొమ్మును అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లను వార్డు ఇన్‌చార్జ్‌ తెన్నేటి జగ్జీవన్‌, ధర్నాల శేఖర్‌, కృష్ణవేణి, సూర్యచంద్రరావులు ప్రత్యేక అభినందించారు.

అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో బలుసులమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ పర్యవేక్షణలో విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. శుక్రవారం సందర్భంగా భారీ అన్నసమారాధన జరిగింది. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

గాయత్రి ఆలయంలో....

వీకర్స్‌కాలనీలోని గాయత్రి దేవి అమ్మవారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా అమ్మవారికి విశేష అలంకరణ, ప్రత్యేక పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. భక్తులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం అధ్వానం



వల్లూరుపల్లి డ్రైనేజీలో మురుగు, చెత్త పేరుకు పోయిన దృశ్యాలు

పెంటపాడు: మండలంలోని వల్లూరు పల్లి గ్రామంలో అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. గత కొద్దిరోజులుగా గ్రామంలో పలు ప్రాంతాల్లో డ్రైనేజీలుశుభ్రత లేక రోడ్లపైకి పొంగి ప్రవహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవలే గ్రామంలో విషజ్వరాలు ప్రబలాయి. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా తక్షణం పంచాయతీ అధికారులు చర్యలు తీసుకొని డ్రైనేజీలు శుభ్రపరిచి చెత్తను నిర్మూలించాలని కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రామారావును వివరణ కోరగా రెండు రోజుల్లో పారిశుధ్య సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

4 కిలోల గంజాయి స్వాధీనం

సాక్షి, భీమవరం: పట్టణంలోని 36వ వార్డు శివరావు పేటలోని ఒక ఇంట్లో 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బ్యూరో ఇన్‌స్పెక్టర్‌ వీవీవీఎస్‌ఎన్‌ వర్మ తెలిపారు. సెబ్‌ అడిషనల్‌ ఎస్పీ ఏటీవీ రవికుమార్‌కు విస్వసనీయ సమాచారం అందడంతో ఎస్పీ యు.రవి ప్రకాష్‌ ఆదేశాల మేరకు పోలిశెట్టి రాము ఇంటిపై దాడి చేసి 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, రామును అరెస్ట్‌ చేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఈ దాడుల్లో సెబ్‌ ఇన్‌స్పెక్టర్‌ కోటేశ్వరరావు, వర్మ, హెడ్‌ కానిస్టేబుల్‌ వై.శ్రీమన్నారాయణ, డిప్యూటీ తహసీల్దార్‌ గ్రంధి పవన్‌కుమార్‌ పాల్గొన్నట్లు వర్మ తెలిపారు.

అత్యుత్తమ సేవలే ప్రతిభకు నిదర్శనం

పెంటపాడు: ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేసే పనిలో అధికారుల అత్యుత్తమసేవలే వారి ప్రతిభకు గొప్ప నిదర్శనమని పెంటపాడు ఎంపీపీ దాసరి హైమావతి పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని పెంటపాడు తహసీల్దార్‌ జీవీ శేష గిరిరావు, ఎంపీడీవో డి. దామోదరరావులు జిల్లా కలెక్టర్‌ చేతుల మీదుగా ఉత్తమ అధికారులగా అవార్డులు తీసుకొన్న సందర్భంగా శుక్రవారం పెంటపాడు మండల సమావేశ మందిరంలో వారిని మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పెంటపాడు మండలంలో సౌమ్యులుగా, వివాదరహితులుగా నిత్యం ప్రజలకు సన్నిహితంగా ఉంటూ కష్టించి పని చేసే అధికారులుగా తహసీల్దార్‌, ఎంపీడీవోలు పేరుపొందారన్నారు. ఈ సేవలను జిల్లా కలెక్టర్‌ గుర్తించి వారిని ప్రత్యేకంగా అభినందించడం సమంజసమన్నారు. ప్రతి అధికారి వారిని గుర్తుంచుకొని ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉంటూ విధి నిర్వహణలో పేరు ప్రఖ్యాతులు సాధించాలన్నారు. వారి సేవలు సదా చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు కై గాల శ్రీనివాస్‌, పార్టీ సీనియర్‌ నాయకులు గుండుమోగుల సాంబయ్య, మైలవరపు పెదబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి, మండల వ్యవసాయసలహామండలి అధ్యక్షులు కట్టుబోయిన కృష్ణప్రసాద్‌, మండల సమాఖ్య అధ్యక్షురాలు ప్రవీణ, ఏపీఎం లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, గ్రామ ఉపసర్పంచ్‌ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, గ్రంధాలయ అధ్యక్షులు కర్రి వరహాలరెడ్డి, పంచాయతీరాజ్‌ ఏఈ ఉన్నమట్ల నవీన్‌, వ్యవసాయాధికారి కె. పార్థసారధి, సర్పంచ్‌ల చాంబర్‌ కార్యదర్శి ఖండవల్లి మణిరాజు, సీనియర్‌ కార్యదర్శి అనిల్‌కుమార్‌, బర్ల జయరాంబాబు, గోకా వెంకటేశ్వరరావు ఎంపీడీవో, తహసిల్దార్‌, ఏపీఎం, పలు కార్యాలయాల సిబ్బంది అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మండల సమావేశమందిరంలో ఎంపీడీవో, తహసీల్దార్‌లను సన్మానిస్తున్న పార్టీ నాయకులు, అధికారులు

జగనన్న ఇళ్లు త్వరగా పూర్తి చేయాలి

తణుకు టౌన్‌: నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల పథకంలో ఇళ్ల స్థలాలు వున్న లే అవుట్‌ల్లో త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్‌ చెప్పారు. శుక్రవారం తణుకు రూరల్‌ మండలం వేల్పూరు గ్రామంలోని నందిరాజు పుంతలోని జగనన్న లేవుట్‌లో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులు, అధికారులతో మాట్లాడుతూ లబ్ధిదారులు తమకు కేటాయించిన స్థలాల్లో త్వరిగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. అదే విధంగా అధికారులు లబ్ధిదారులకు అవసరమైన మెటీరియల్‌ను వెంటనే అందించాలని కోరారు. దీనితోపాటు కాలనీకి వెళ్లే కాలువ గట్టు రోడ్డును అప్రోచ్‌ రోడ్డుగా అభివృద్ధి చేయాలని ఇంజనీరింగ్‌ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్‌ ఏఈ వీ వెంకటరెడ్డి, పంచాయితీ కార్యదర్శి యుగంధర్‌ శ్రీనివాసర్‌, ఇంజనీరింగ్‌ అసిస్టెంట్‌ షమ్మీ, నాయకులు పాల్గొన్నారు.



ఇంటి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్‌, ఇతర అధికారులు

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

పెంటపాడు: మాదకద్రవ్యాలు లేని ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు యువత నడుంబిగించాలని పెంటపాడు డీఆర్‌ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఎం. శ్యాంబాబు, ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బోర్డ్‌ ఇనస్పెక్టర్‌ బి. సత్యనారాయలు పేర్కొన్నారు. పెంటపాడులోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం డ్రగ్స్‌రహిత ఆంధ్రప్రదేశ్‌ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఎన్‌ఎస్‌ఎస్‌, ఎన్‌సీసీ, మహిళా సాధికారత విభాగాల ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. మాదకద్రవ్యాల వల్ల యువత నిర్వీర్యం, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం, అభివృద్ధి కుంటుపడటం వంటి పలు కారణాలను విద్యార్థులకు వివరించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి కళాశాలలో డ్రగ్స్‌ నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. డ్రగ్స్‌ పట్ల సమాచారం అందిస్తూ, వాటి పట్ల విద్యార్థులు, అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆరోగ్యకరమైన సమాజం తీర్చిదిద్దేందుకు యువత పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు ఎస్సై, ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఎస్సై జి. సత్యనారాయణ, కళాశాల ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్‌ అధికారులు అవగాహన సదస్సులో పాల్గొని పలు విషయాలను వివరించారు.



డీఆర్‌ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆకుతీగపాడు గ్రామ ఉపసర్పంచ్‌గా రామారావు

పెంటపాడు: మండలంలోని ఆకుతీగపాడు గ్రామ ఉపసర్పంచ్‌ ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. గ్రామ ఉపసర్పంచ్‌గా కొల్లూరి గురురామారావు ఎన్నికైయ్యారు. ఇప్పటివరకు ఉపసర్పంచ్‌గా కొనసాగిన పడాల వెంకటలక్ష్మి గతంలో కుదిరిన ఒప్పందం మేరకు రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక జరిగింది. తణుకు ఈవోపీఆర్‌డీ రాజేంద్రప్రసాద్‌ ఈ ఎన్నికకు రిటర్నింగ్‌ అధికారిగా వ్యవహరించారు. ఏకగ్రీవానికి పలువురు ప్రయత్నించగా విఫలం అయ్యింది. కాగా పోటీలో గురురామారావుతో పాటు, వీరాబత్తుల వెంకటలక్ష్మికూడా పోటీకి దిగడంతో రెండు నామినేషన్‌లు పడ్డాయి. పోలింగ్‌ ముగిసేసరికి వీరాబత్తుల వెంకటలక్ష్మికి 3 ఓట్లు రాగా కొల్లూరి గురురామారావుకు 8 ఓట్లు వచ్చాయి. దీంతో ఎన్నికల అధికారి రాజేంద్రప్రసాద్‌ ఆకుతీగపాడు గ్రామ ఉపసర్పంచ్‌గా గురురామారావును ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌ దాసం వెంకటేశ్వర్లు, పెంటపాడు ఈవోపీఆర్‌డీ ప్రసాద్‌, వార్డు సభ్యులు పాల్గొని నూతన ఉపసర్పంచ్‌ను అభినందించారు.



ఉపసర్పంచ్‌ గురురామారావును అభినందిస్తున్న సర్పంచ్‌, వార్డు సభ్యులు, ఎన్నికల అధికారి

దివ్యాంగ విద్యార్థులకు పరీక్షలు



భీమవరం భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు అందచేయడానికి చర్యలు తీసుకున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సమగ్రశిక్ష జిల్లా అడిషనల్‌ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌ పి శ్యామ్‌సుందర్‌, జిల్లా విద్యా శాఖాధికారి ఆర్‌ వెంకటరమణ అన్నారు. శుక్రవారం భీమవరం పట్టణంలోని గాలిరామయ్య మునిసిపల్‌ ప్రాథమిక పాఠశాలలో ఉన్న భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లలకు ఉచిత ఉపకరణాల పంపిణీ కోసం ఏర్పాటు చేసిన నిర్ధారణ పరీక్షల కోసం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ భీమవరం పట్టణం, వీరవాసరం, కాళ్ల, ఉండి, ఆకివీడు, పాలకోడేరు, భీమవరం రూరల్‌ మండలాలకు చెందిన దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్‌ ఎంఎస్‌ శ్రీమన్నారాయణ, సీఎంఓ ఎ.రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

అవసరమైన మేరకు ఎరువులు వాడాలి

అత్తిలి: రైతులు అవసరమైన మేరకు ఎరువులు వాడాలని మండల వ్యవసాయశాఖాధికారి టీకే రాజేష్‌ చెప్పారు. అత్తిలి మండలం ఈడూరు గ్రామంలో శుక్రవారం దాళ్వాసాగులో మెళకువలపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ అతిగా కాంప్లెక్స్‌ ఎరువులు వాడినట్లయితే పాస్ఫరస్‌ అధికమై జింక్‌ లోపం అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. వరిలో జింక్‌లోపం కనిపించినట్లయితే ఒక లీటరు నీటికి 2 గ్రాముల చిలేటెడ్‌ జింక్‌ కలిపి వారం, పది రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలని చెప్పారు. రైతులు అనవసరంగా ముందస్తు స్ప్రేయింగ్స్‌ చేసినట్లయితే వారికి అనుకున్న లాభం జరగకపోగా పెట్టుబడి అధికం అవుతుందని తెలిపారు. పైరుపై పురుగు, తెగులు ఉధృతి కనిపిస్తేనే మందులు వాడాలన్నారు. దాళ్వాసాగులో రైతులు 1121 రకం ఎక్కువగా సాగుచేస్తున్నారని, దీనికి బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు వచ్చే లక్షణం ఎక్కువగా ఉందన్నారు. ఆకు ఎండు తెగులు గుర్తించిన వెంటనే 4 నుంచి 5 రోజులు పొలంలో నీరుతీసి ఎండబెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ మంతెన వెంకట రామలింగరాజు, వీఏఏ సీహెచ్‌ రాము, రైతులు పాల్గొన్నారు.



అత్తిలి మండలం ఈడూరులో రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏఓ రాజేష్‌

సామాన్యులకు ఉపయోగపడని కేంద్ర బడ్జెట్‌

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ సామాన్యుల ప్రజలని తీవ్రంగా నిరాశ పరిచిందని సీపీఐ ఏరియా కన్వీనర్‌ మండల నాగేశ్వరరావు విమర్శించారు. స్థానిక కపర్ధి భవనంలో శుక్రవారం జరిగిన సమావేశంలో మండల నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్‌ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీ రాష్ట్రానికి ఎటువంటి హామీలు ఇవ్వలేదని, ప్రత్యేక హోదా అంశంపై మాట్లాడలేదని, రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన అనేక హామీలు నేటికి అమలు చేయలేదని, ప్రజల మౌలిక అంశాలు లేవని, విశాఖపట్నం రైల్వే జోన్‌, కొవ్వూరు-భద్రాచలం రైల్వే లైన్‌, కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్‌, పోలవరం ప్రాజెక్టు, పోలవరం నిర్వాసితులు, రైతులు గురించి గాని ఊసే లేదన్నారు. కార్మికులకు, ఉద్యోగులకు కూడా ఎటువంటి హామీ ఇవ్వలేదని కేవలం కార్పొరేట్‌ అనుకూల బడ్జెట్‌ అని సీపీఐ వ్యతిరేకిస్తుందని తెలిపారు. బడ్జెట్‌పై మరోసారి పరిశీలన చేయాలని, చర్చించి అందరికి ఆమోదయోగ్యమైన బడ్జెట్‌ను ప్రకటించాలని డిమాండ్‌ చేశారు.



సీపీఐ కపర్ధి భవనంలో మాట్లాడుతున్న మండల నాగేశ్వరరావు

13 నుంచి సువార్త సభలు

ఉండి: మండలంలోని ఆరేడులో ఈ నెల 13 నుంచి 15 వరకూ ఎష్కోలు యేసయ్య దీవెన ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో యేసుక్రీస్తు రక్షణ సువార్త సభలను నిర్వహిస్తున్నట్లు పాస్టర్‌ కే డేవిడ్‌రాజు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ సభలకు వాక్యోపదేశకులుగా పాస్టర్‌ ఎం.ప్రభుదాస్‌ (ఏలూరు), సిస్టర్‌ టి.మరియమ్మ (పాములపర్రు), బ్రదర్‌ విశ్వాస్‌పాల్‌(రాజమండ్రి) నుంచి విచ్చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సభలకు విశ్వాసులంతా తప్పక రావాలని ఆహ్వానిస్తున్నట్లు పాస్టర్‌ తెలిపారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

అత్తిలి: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ ఎం శ్రీదేవి చెప్పారు. అత్తిలి మండలం గుమ్మంపాడు అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాలు, వాటివల్ల కలిగే అనార్థాలు, బాల్య వివాహ నిరోధక చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు సంపూర్ణ ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎం రాజకుమారి, సహాయకురాలు, వలంటీర్లు, కిశోరబాలికలు పాల్గొన్నారు.

ఆరవల్లిలో.. : చిన్నారుల ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్‌ అన్నారు. అత్తిలి మండలం ఆరవల్లి 252 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు వైద్య పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఉండ్రాజవరపు రాణి, గుబ్బల విజయవాణి, ఏఎన్‌ఎం విజయలక్ష్మి, హెల్త్‌ అసిస్టెంట్‌ వేణుగోపాలస్వామి పాల్గొన్నారు.



బాల్యవివాహాలు వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్‌ శ్రీదేవి

కుష్టు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కుష్టు వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ పారామెడికల్‌ ఆఫీసర్‌ ఎం.పి.రమేష్‌ అన్నారు. కుష్టు వ్యాధిపై ఎ.ఎన్‌.ఎంలు, ఆశాలకు అవగాహన శిబిరం శుక్రవారం అర్బన్‌ హెల్త్‌ బీబి సెంటర్‌లో నిర్వహించారు. పట్టణంలో హెల్త్‌ సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ఎం.పి.రమేష్‌, మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ ఆషాలతలు మాట్లాడుతూ స్పర్శలేని మచ్చలు ఉంటే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి గాని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గాని సంప్రదించాలన్నారు. వ్యాధికి ఉచితంగా ముందులు సరఫరా చేస్తారని వెల్లడించారు. కుష్టు వ్యాధి మైక్రో బాక్టీరియమ్‌ లెప్రే అనే బాక్టీరియా ద్వారా వస్తుందని, ఈ క్రిములు తుమ్మడం వల్ల నోటీ తుంపరలు ద్వారా దగ్గడం వల్ల వ్యాధి వ్యాప్తి చెందుతుందని, వ్యాధి లక్షణాలు కన్పించడానికి సుమారు 3 నుంచి 5 సంవత్సరాలు సమయం పడుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు, పాల్గొన్నారు.



పట్టణంలో కుష్టువ్యాధిపై అవగాహన ర్యాలీ దృశ్యం

మండపాకలో ఫ్యామిలీ ఫిజీషియన్‌ కార్యక్రమం



మండపాకలో ఫ్యామిలీ ఫిజీషియన్‌ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

తణుకు టౌన్‌: తణుకు రూరల్‌ మండలం మండపాక గ్రామ సచివాలయం ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్‌ కార్యక్రమం నిర్వహించినట్లు రేలంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్‌ బంగారు రవి తెలిపారు. శుక్రవారం మండపాక గ్రామంలోని 1వ గ్రామ సచివాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్‌ కార్యక్రమంలో గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలను పరిశీలించి, వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశామన్నారు. గ్రామంలో వృద్ధులు, మహిళలకు బీపీ, సుగర్‌ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో 104 వైద్యులు వెంకటేశ్వరరావు, ఎంపీహెచ్‌ఈవో జీకేఆర్‌సీవీ ప్రసాద్‌, సూపర్‌వైజర్లు పీ రాణి, జయరాజు, హెల్త్‌ అసిస్టెంట్‌ వైటీ మూర్తి, ఎంఎల్‌హెచ్‌పీ ప్రవీణ, డీవో సాయిరాం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమృద్ధిగా నీరు అందించాలి

సాక్షి, భీమవరం: జిల్లాలోని కాలువ శివారు భూములకు సైతం సమృద్ధిగా సాగునీరు అందించడానికి వంతుల వారీ విధానం పటిష్టంగా అమలు చేయాలని రైతు కార్యాచరణ సమితి అధ్యక్షుడు గోపాలకృష్ణంరాజు, పాతపాటి మురళీరాజు కోరారు. శుక్రవారం భీమవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ సాగు నీటి ఎద్దడి లేకుండా జలవనరుల శాఖ చేపట్టిన వంతుల వారీ విధానంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రైతుల సలహా మండలి సమావేశాలకు రాజకీయాలకు అతీతంగా రైతు సంఘాల ప్రతినిధులను కూడా ఆహ్వానించాలని, దీనిపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు వారు తెలిపారు. భూముల రీసర్వే విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు నల్లం నాగేశ్వరరావు, సీతారామరాజు, తమ్మినీడి నాగేశ్వరరావు, గంటా సుందర్‌కుమార్‌ పాల్గొన్నారు.

గ్రూప్‌-1 పరీక్షలకు ఉచిత శిక్షణ

సాక్షి, భీమవరం: స్థానిక ఆర్‌ఆర్‌డీఎస్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రూప్‌-1,2,4, పోలీసు కానిస్టేబుల్‌, ఎస్సై పోటీ పరీక్షల శిక్షణ కోసం ఉచిత కోచింగ్‌ సెంటర్‌ ఏర్పాటు చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వీకేజే ప్రసూన శుక్రవారం విలేకరులకు చెప్పారు. ఈ నెల 6 నుంచి కోచింగ్‌ క్లాసులు ప్రారంభమవుతాయన్నా రు. ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు క్లాసులు నిర్వహిస్తామని ఆసక్తి ఉన్న అభ్యర్థులు కోచింగ్‌ సెంటర్‌ కో-కన్వీనర్‌ పి అమూల్యరావు, సెల్‌ నెంబర్‌ 84648 72037కు ఫోన్‌ చేయాలని సూచించారు.